సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం : 31 : మే : 2024



నేవీ ఉద్యోగికి కన్నీటి వీడ్కోలు
నేవీ ఉద్యోగి మారెడ్డి సందీప్‌రెడ్డి మృతదేహానికి నరసింహపురంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. - 8లో



సైబర్ నేరాలపై జాగ్రత్త
సైబర్ నేరగాళ్లు ఫోన్ వినియోగదారుల బలహీనతలను ఆసరా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. - 9లో

గరిష్టం / కనిష్టం
43° / 32°
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

సాక్షి,యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడులకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంత్ కే.జండగే ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. జూన్ 2వ తేదీన ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ ఉంటుందన్నారు. అంతకుముందు భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించనున్నట్లు వెల్లడించారు. వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

1న యాదాద్రి క్షేత్రంలో హనుమాన్ జయంతి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జూన్ 1వ తేదీన హనుమాన్ జయంతి నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల మధ్యాహ్నం 12.30గంటల వరకు ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, పాతగుట్టలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో అష్టోత్తర శతమన్యసూక్త పారాయణం, అభిషేకం, లక్ష తమలపాకులతో అర్చన, మహా నివేదన వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొండపైన గల విష్ణు పుష్కరిణి చెంత ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే లక్ష తమలపాకుల అర్చనలో పాల్గొనే భక్తులు రూ.516 టిక్కెట్ తీసుకోవాలని వెల్లడించారు.

ఆయిల్‌పామ్‌లో పూత తీయడంపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆయిల్‌ఫెడ్ సిబ్బంది

రామన్నపేట : ఆయిల్‌పామ్ చెట్లకు పూత తొలగించే విధానంపై గురువారం సిరిపురం గ్రామంలో ఆయిల్‌ఫెడ్ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎండీ ఖాజామొయినొద్దీన్, జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 30 నెలల పాటు క్రమం తప్పకుండా పూత తొలగించాలన్నారు. సంరక్షణ చర్యలు సరైన పద్ధతిలో ఉంటేనే చెట్లు వృద్ధి చెంది దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు. రైతులకు ఆయిల్‌పామ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మూడేళ్లు కాపాడితే ముప్పై ఏళ్లు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం చెట్లకు ఫీడింగ్, ఫర్టిలైజేషన్, నీటి సస్యరక్షణపై అవగాహన కల్పించారు. మేక అశోక్‌రెడ్డి ఆయిల్‌ఫామ్ తోటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చారిత్రక కట్టడాలకు విద్యుత్ లైట్లతో అలంకరణ

సాక్షి,యాదాద్రి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 1వ తేదీ నుంచి భువనగిరి ఖిలా, మెదక్ చర్చి, కరీంనగర్‌లో ఎలగందుల కోట, నిజామాబాద్ కోటలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి.

సాధారణ కాన్పులు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామకృష్ణ

మోత్కూరు : సాధారణ కాన్పులు పెంచాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. డాక్టర్లు, సిబ్బందితో సమావేశమై కాన్పులపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని గ్రామాల్లో గర్భిణులకు ప్రతి నెలా పరీక్షలు చేయిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు చేయించుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా గర్భిణుల్లో రక్తహీనత ఏర్పడకుండా ఐరన్ మాత్రలు, పౌష్టికారం తీసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ హేమంత్‌కుమార్, ప్రణీషా, విలియమ్, డీపీహెచ్‌ఎన్‌ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో చేరండి

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడమే లక్ష్యం
- విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రణాళిక
- 3నుంచి 19వ తేదీ వరకు బడిబాట
- మార్గదర్శకాలు జారీ చేసిన విద్యాశాఖ



సాక్షి, యాదాద్రి : ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా జూన్ 3నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం చేపట్టనుంది. ఏ రోజున ఎవరేం చేయాలనే మార్గదర్శకాలను విడుదల చేసింది. నిర్ణయించిన తేదీల్లో ఉదయం 7నుంచి 11 గంటల వరకు ఉపాధ్యాయులు తమ గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. బడీడు, బడి బయట పిల్లలను గుర్తించి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపైనా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తమ పిల్లలను సర్కార్ స్కూళ్ల బాట పట్టించేలా కృషి చేయడం బడిబాట ముఖ్య ఉద్దేశం.

తేదీల వారీగా చేపట్టనున్న కార్యక్రమాలు
- 3వ తేదీన గ్రామ స్థాయిలో ర్యాలీలు నిర్వహించనున్నారు. ర్యాలీల్లో స్వయం సహాయక మహిళా సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేయనున్నారు. తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో ప్రతిజ్ఞలు చేయించాలి.
- 4న ఇంటింటికి వెళ్లి బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలి. వారి వివరాలను గ్రామ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి.
- 5నుంచి 10వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన తీరుపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలల్లో నమోదు చేయాలి.
- 11న గ్రామ సభలు ఏర్పాటు చేసి బడిబాట లక్ష్యాపై చర్చిస్తారు
- 12న నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజు స్వాగత దినోత్సవంగా పాటిస్తారు. ఈ సందర్భంగా పాఠశాలలను అలంకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు రంగోలి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన వసతులను వివరించాలి. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ వారితో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయాలి. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించాలి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయాలి. గత విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఎక్కువ హాజరు శాతం కలిగిన విద్యార్థులను, తమ పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులను సన్మానించాలి.
- 13న తరగతుల వారీగా విద్యార్థులు తయారు చేసిన విద్యా ప్రమాణాలకు సంబంధించి పోస్టర్లు, చార్ట్‌లను ప్రదర్శించి తరగతి గదులను డెకొరేట్ చేయాలి.
- 14న స్థానిక ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ కమిటీలు, తల్లిదండ్రులు, కమ్యూనిటీ పెద్దలతో కలిసి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టాలి. చదువు ప్రాముఖ్యత, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలి.
- 15న సహిత విద్య, బాలికల విద్యా దినోత్సవం నిర్వహించాలి. బడిబాటలో గుర్తించిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలు, పాఠశాలల్లో చేర్పించాలి. బాల కార్మికులు లేకుండా చూడాలి. గుర్తించిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి.
- 18న డిజిటల్ తరగతులపై అవగాహన, విద్యార్థులతో మొక్కలు నాటించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన విషయాన్ని ఇంటింటా చదువుల పంట అనే యాప్ గురించి తలిదండ్రులకు తెలియజేయనున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించిన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.
- 19న క్రీడాదినోత్సవంగా పాటించి ఆటలపోటీలు నిర్వహించి బడిబాటకు ముగింపు పలకనున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

సాక్షి యాదాద్రి : బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. బడిబాట కార్యక్రమం నిర్వహణకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం అయ్యారు. బడీడు పిల్లలు, మధ్యలో చదువు మానేసిన పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ స్కూళ్లలో కల్పిస్తున్న వసతులు, పథకాలను, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు, కమ్యూనిటీ పెద్దలకు వివరించాలని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలన్నారు. బడిబాట కోసం ఏర్పాటు చేసిన కమిటీలు ఈనెల 31న సమావేశమై క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశ, అంగన్‌వాడీలు, స్వయం సహాయక మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టరు గంగాధర్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, డీఆర్‌డీఓ కృష్ణన్, డీఈఓ నారాయణరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే. జెండగే


నిర్మానుష్యంగా యాదాద్రి ఘాట్ రోడ్డు

బెంబేలెత్తిస్తున్న భానుడు

- గుట్టలో 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- మిగతా మండలాల్లోనూ 42.7 డిగ్రీలకు పైనే నమోదు

గురువారం ఉష్ణోగ్రతలు	
వలిగొండ	44.5
ఆలేరు	44.1
మోత్కూరు	43.7
బీబీనగర్	43.3
గుండాల	43.2
ఆత్మకూర్ (ఎం)	42.8
అడ్డగూడూరు	42.8
భువనగిరి	42.7

భువనగిరి టౌన్, యాదగిరిగుట్ట : భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. గురువారం యాదగిరిగుట్టలో రికార్డ్‌స్థాయిలో 45.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా అన్ని మండలాల్లోనూ 42.7 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రత రికార్డ్ అయ్యింది. ఎండతీవ్రత కారణంగా యాదాద్రికి భక్తుల సంఖ్య తగ్గింది. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే కాస్త రద్దీ కనిపించింది. మధ్యాహ్నం సమయంలో ఆలయ పరిసరాలు, ఘాట్ రోడ్డు నిర్మానుష్యంగా మారాయి. ద్రోణి కారణంగా వర్షాలు కురువడంతో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. మూడు రోజులుగా మళ్లీ ఉష్ణోగ్రతలు పెరగడం, ఉక్కపోత తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మూడు, నాలుగు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి వారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాతం సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి తులసీ దళాలతో అర్చించారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం వేళ స్వామి, అమ్మవారి జోడు సేవలను మాడ వీధిలో ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.


స్వామి, అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు


వ్యవసాయ, పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి, యాదాద్రి : విత్తనాలు, ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతు కే.జెండగే హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, పోలీసు అధికారులతో సమావేశం అయ్యారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా, నకిలీ విత్తనాలు అరికట్టేలా వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో నాలుగు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని, ఎరువుల దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని సూచించారు. విత్తన, ఎరువుల గోదాంలు, డీలర్ షాపులను తనిఖీ చేయాలని, లైసెన్సులు, స్టాక్, ధర పట్టికలు, బిల్లులు, డెలివరీ చలానాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. విత్తన ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలను పరిశీలించాలని, అధిక ధరకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాల వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. రైతులు కూడా బ్రాండెడ్ విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదులు తీసుకొని భద్రపరుచుకోవాలని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఏడీఏలు దేవ్‌సింగ్, పద్మావతి, వెంకటేశ్వర్లు, నీలిమ పాల్గొన్నారు.

కోడ్ ముగియగానే బదిలీలు

- సొంత జిల్లాలకు వెళ్లడానికి అధికారుల ఆసక్తి
- ఉన్నతస్థాయిలో పైరవీలు

సాక్షి, యాదాద్రి : ఎన్నికల కోడ్ ముగియగానే జిల్లాలో అధికారుల బదిలీలు జరిగే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి జాబితాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లతో పాటు ఆర్డీఓలు, ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు బదిలీ అయ్యారు. వీరిలో సొంత జిల్లా, ఒకే చోట మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్నవారు ఉన్నారు. కాగా ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అధికారులు ఇక్కడికి వచ్చారు. జూన్ 4వ తేదీన లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది. 6న కోడ్ ముగియనుంది. అనంతరం అధికారులను బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బదిలీపై వచ్చిన అధికారులు సొంత జిల్లాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకోవడానికి అధికార పార్టీ పెద్దలను ఆశ్రయిస్తున్నారని సమాచారం.

విధులకు రాకున్నా వేతనం!

- భువనగిరి మున్సిపాలిటీలో అనారోగ్యంబారిన పారిశుధ్య కార్మికులు
- కొంతకాలంగా విధులకు గైర్హాజరు
- రికార్డుల్లో వస్తున్నట్లుగా నమోదు
- ప్రతినెలా పూర్తి వేతనం
- శానిటేషన్ అధికారి చేతివాటం



భువనగిరి టౌన్ : ఆ ముగ్గురు కార్మికులు అనారోగ్యం కారణంగా డ్యూటీకి వెళ్లరు. అయినా విధులకు వచ్చినట్లు రిజిస్టర్‌లో హాజరు నమోదవుతుంది. ప్రతినెలా పూర్తిస్థాయి వేతనం అందుతుంది. కొన్ని నెలలుగా ఈ తంతు సాగుతుండడంతో ఇటీవల ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు తీసుకోకుండా మున్సిపల్ యంత్రాంగం చోద్యం చూస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

ఏం జరుగుతుందంటే..
భువనగిరి మున్సిపాలిటీలోని శానిటేషన్ విభాగంలో ముగ్గురు కార్మికులు అనారోగ్యం బారిన పడ్డారు. వీరిలో ఒకరు పర్మినెంట్, ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులు. ఈ ముగ్గురూ కొంతకాలంగా విధులకు హాజరు కావడం లేదు. వారి వంతుకు శానిటేషన్ అధికారులు మున్సిపాలిటీలోని మరో కార్మికుడిని పెట్టి పనులు చేయిస్తున్నారు. అందుకు గాను పర్మనెంట్ కార్మికురాలు తన వేతనం నుంచి రూ.15వేలు, కాంట్రాక్ట్ కార్మికులు ఇద్దరు రూ.5వేల చొప్పున రూ.10వేలు ప్రతినెలా శానిటేషన్ అధికారులకు ముట్టజెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో కొంత డబ్బు కార్మికుడికి చెల్లించి మిగతాది శానిటేషన్ అధికారులు నొక్కేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విధులకు హాజరుకాకున్నా ఫేక్ అటెండెన్స్ వేస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు.

వెలుగులోకి వచ్చిందిలా..
ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు విధులకు రాకున్నా ఫేక్ అటెండెన్స్‌తో ప్రతి నెలా పూర్తిస్థాయి వేతనం పొందుతున్నారని మున్సిపాలిటీలో పని చేస్తున్న ఓ జవాను ఈ నెల 27న మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు ఫేక్ అటెండెన్స్ వేస్తూ వారికి అక్రమంగా జీతాలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రామంజులరెడ్డిని వివరణ కోరగా విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బండరాయి తొలగిస్తేనే సాగునీరు

- ఆత్మకూర్(ఎం) మండల పరిధిలో నిలిచిన బునాదిగాని కాల్వ పనులు
- కూరెళ్ల వద్ద కాల్వకు అడ్డొచ్చిన బండరాయి
- ఇంతవరకు అటువైపు కన్నెత్తి చూడని అధికారులు, ప్రజాప్రతినిధులు
- సాగునీరు అందక రైతుల ఇబ్బందులు


ఆత్మకూర్(ఎం) మండల పరిధిలో బునాదిగాని కాల్వ


కూరెళ్ల వద్ద కాల్వకు అడ్డంగా ఉన్న బండరాయి

ఆత్మకూరు(ఎం): బునాదిగాని కాల్వ పనులు ఆత్మకూర్(ఎం) మండల పరిధిలో ముందుకు సాగడం లేదు. కూరెళ్ల వద్ద బండరాయి అడ్డురావడంతో పది నెలల క్రితం పనులు నిలిచిపోగా.. ఇంతవరకు అటువైపు ఎవ్వరూ కన్నెత్తి చూడలేదు. బండరాయి తొలగిస్తే తప్పా.. కాల్వ పనుల్లో కదలిక వచ్చే అవకాశం లేదు. వలిగొండ, భువనగిరి, మోటకొండూరు, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలాల రైతులకు సాగునీరు అందించేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బునాదిగాని కాల్వను మంజూరు చేసింది. ఇందుకు రూ.10 కోట్లు నిదులు మంజూరు చేశారు. 2006 ఏప్రిల్ 4వ తేదీన కాల్వ పనులను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూసీ ఆధారిత కాల్వల ఆధునీకరణపై దృష్టి సారించింది. అందులో భాగంగా బునాదిగాని కాల్వకు రూ.100 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. అనంతరం సాగునీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు చూసి అప్పటి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో నాంచారిపేట నుంచి ఆత్మకూరు(ఎం) మండల పరిధి వరకు సుమారు 20 కిలో మీటర్ల మేర కాల్వను వెడల్పు చేయించారు.

నిలిచిన పనులు
ఆధునీకరణలో భాగంగా ఆత్మకూరు(ఎం) మండల పరిధి సర్వేపల్లి నుంచి కప్రాయపల్లి వరకు కాల్వను వెడల్పు పనులు చేపట్టారు. కాగా కూరెళ్ల గుట్ట కింద కాల్వకు అడ్డుగా పెద్ద బండరాయి రావడంతో పనులు ముందుకు సాగలేదు. బండరాయి తొలగించాలంటే ఖర్చుతో కూడుకుంది కావడంతో అక్కడితో పనులు నిలిపివేశారు. బ్లాస్టింగ్ చేసి బండరాయిని తొలగించే అవకాశం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. గత వర్షాకాలంలో పహిల్వాన్‌పురం చెరువు నిండి అలుగుపోయడంతో నీరంతా బునాదిగాని కాల్వలోకి చేరి కూరెళ్ల గుట్ట కింద వద్ద కట్ట తెగడంతో పొలాలు మునిగిపోయిన విషయం తెలిసిందే. మళ్లీ వానాకాలం సమీపిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాల్వ పూర్తయితే 50వేల ఎకరాలకు నీరు
బునాధిగాని కాల్వ నిర్మాణం పూర్తయితే జీరో పాయింట్ నుంచి అడ్డగూడూరు మండలం ధర్మారం వరకు సుమారు 50వేల ఎకరాలకు సాగు నీరు అందే అవకాశం ఉంటుందని ఐబీ అధికారులు పేర్కొంటున్నారు. బండరాయి తొలగించి అడ్డగూడూరు మండలం ధర్మారం వరకు కాల్వ పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

కాల్వ వస్తే వరి వేస్తా



బునాదిగాని కాల్వ వస్తే వరి సాగు చేస్తా. సాగు నీరు లేకపోవడంతో మెట్ట పంటలు వేసుకుంటున్నాం. వర్షం మీదనే అధారపడాల్సి వస్తుంది. రైతుల సాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేయాలి.
–పైళ్ల విఠల్‌రెడ్డి, నాంచారిపేట

భూమి పోయినా నీళ్లు రాలేదు



కాల్వ నిర్మాణంలో భూమి పోయింది. 18 ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు సాగునీరు రాలేదు. కాల్వలో నీళ్లు వస్తే ఈ ప్రాంత రైతులందరికీ సమస్య తీరుతుంది. భూములన్నీ సాగులోకి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి.
–సామ కృష్ణారెడ్డి, పోసానికుంట

నిధులు వస్తే పనులు చేపడుతాం



కూరెళ్ల గుట్ట కింద కాల్వకు బండరాయి అడ్డుగా రావడంతో పనులు నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.
–సునీల్‌ప్రసాద్, నీటి పారుదల శాఖ డీఈ

క్లుప్తంగా

కర్ల శ్రీనివాస్‌కు ఇందిరా ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి, ప్రముఖ కళాకారుడు కర్ల శ్రీనివాస్ ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ వారి ఇందిరా ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో సినీ ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు గురువారం ఆయన తెలిపారు.

యువతి అదృశ్యం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దసూరారం గ్రామానికి చెందిన ముస్కు పవిత్ర నకిరేకల్ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసింది. బుధవారం సాయంత్రం ఆమె టైలర్ షాపునకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. పవిత్ర తండ్రి ముసుకు భిక్షం ఫిర్యాదు మేరకు గురువారం తిప్పర్తి ఏఎస్‌ఐ సింగం రామ్మూర్తి కేసు నమోదు చేశారు.

అసైన్డ్ భూమి పట్టా కేసులో ముగ్గురి రిమాండ్

నిడమనూరు: మండలంలోని తుమ్మడం రెవెన్యూ పరిధిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూమిని అక్రమంగా పట్టా చేసిన కేసులో అప్పటి తుమ్మడం గ్రామ వీఆర్‌ఓ ఎం. సుమన్, పట్టా చేయించుకున్న మార్తి సురేందర్‌రెడ్డి, బొమ్ము శ్రీనివాస్‌ను గురువారం పోలీసులు మిర్యాలగూడ కోర్టుకు రిమాండ్ చేశారు. మార్తివారిగూడేనికి చెందిన మార్తి వెంకటరెడ్డి ఈ వ్యవహారం గురించి గతంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. ఈ మేరకు అక్రమ పట్టాకు సంబంధించి బాధ్యులను గుర్తించి వారిపై కేసు నమోదు చేయాలని నిడమనూరు పోలీసులకు నాటి తహసీల్దార్ ప్రమీల ఫిర్యాదు చేశారు. కానీ విచారణ సాగకపోవడంతో మళ్లీ వెంకటరెడ్డి కోర్టుకు వెళ్లడంతో కేసును నల్లగొండ టాస్క్‌ఫోర్స్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసుకు సంబంధించి నాడు నిడమనూరులో పనిచేసిన ముగ్గురు తహసీల్దార్లను విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ కేసులో మరిన్ని అరెస్టులు ఉండవచ్చని తెలుస్తోంది.

కారు బోల్తా.. ఐదుగురికి గాయాలు

హాలియా: అదుపుతప్పి కారు బోల్తా పడడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం అనుముల మండలంలోని వెంకటాపురం గ్రామ స్టేజీ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన మహంకాళి హరినాథ్, గట్టు మాధురి, మహంకాళి విమలమ్మ, హరిప్రియ, వైష్ణవి కలిసి కారులో గురువారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామంలో జరగనున్న తమ బంధువు సంవత్సరీకం కార్యక్రమానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో అనుముల మండలం వెంకటాపురం గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ఎద్దుల మృతిపై విచారణ

- మట్టపల్లి గోశాలను సందర్శించిన సూర్యాపేట జిల్లా పశువైద్యాధికారి
- చికిత్స పొందుతున్న మరో ఎద్దు మృతి


మట్టపల్లి గోశాలలో మృతిచెందిన ఎద్దును పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి కృష్ణానది వంతెనపై రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కంటైనర్‌లో మృతిచెందిన ఎద్దుల ఘటనపై సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పశువైద్యాధికారి ఎ. కుమారస్వామి గురువారం జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ పి.పెంటయ్యతో కలిసి విచారణ జరిపారు. కాగా బుధవారం మృతిచెందిన 16 ఎద్దులతో పాటు మట్టపల్లి గోశాలలో చికిత్స పొందుతున్న మరో ఎద్దు కూడా గురువారం మృతిచెందింది. దీంతో ఆయన ముందుగా స్థానిక గోశాలకు వెళ్లి మృతి చెందిన ఎద్దును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశువులను రవాణా చేసేటప్పుడు తప్పనిసరిగా పశువైద్యాధికారి ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. వాహనంలో పశువులకు సరిపడా స్థలంతో పాటు ఆహారం, నీళ్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. రాత్రిపూట మాత్రమే పశువులను తరలించాలన్నారు. మట్టపల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన కంటైనర్‌లో ఈ నిబంధనలు ఏవీ పాటించలేదన్నారు. 11పశువులను తరలించే కంటైనర్‌లో ఏకంగా 26 పశువులు తరలించారన్నారు. అంతేకాకుండా ఆ కంటైనర్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా లేదన్నారు. మేత, నీళ్లు ఇవ్వకుండా చాలా దూరం నుంచి తీసుకొస్తుండడంతో 17ఎద్దులు మృత్యువాత పడినట్లు గుర్తించామన్నారు. మిగిలిన 9 ఎద్దులను పోలీసులు నల్లగొండలోని యోగానంద గోశాలకు తరలించారన్నారు. మఠంపల్లి పశువైద్యాధికారితో పాటు హుజూర్‌నగర్, చింతలపాలెం మండలాల నుంచి నలుగురు పశువైద్యుల బృందం కాళ్లు విరిగిన ఎద్దులకు చికిత్స చేయడంతో పాటు మృతిచెందిన ఎద్దులకు పోస్టుమార్టం చేశారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఎద్దుల మృతిపై పూర్తిస్థాయి విచారణ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఆయన వెంట మఠంపల్లి, హుజూర్‌నగర్, చింతపాలెం మండలాల పశు వైద్యాధికారులు సుష్మ, శ్రీనివాసరెడ్డి, రమేష్‌నాయక్, మధు తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతి

హుజూర్‌నగర్: ఎద్దుల మృతి ఘటనపై విచారణ చేసేందుకు వచ్చిన సూర్యాపేట జిల్లా పశువైద్యాధికారి ఏ. కుమారస్వామి గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని పశువైద్యశాలలో విలేకరులతో మాట్లాడారు. పూర్తిస్థాయి నిబంధనలు పాటిస్తేనే పశువుల తరలింపునకు అనుమతివ్వడం జరుగుతుందని చెప్పారు. పశువులను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

కోర్టులో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా ఫాస్ట్ ట్రాక్ సెషన్స్ కోర్టులో రెండేళ్ల కాంట్రాక్టు పద్ధతిపై సీనియర్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, టైపిస్ట్, డ్రైవర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో పనిచేసేందుకు అర్హులైన రిటైర్డ్ జ్యుడీషియల్ ఉద్యోగులు, ఇతర అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ జిల్లా జడ్జి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు జూన్ 7 సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి నల్లగొండ పేరు మీదుగా సీల్డ్ కవర్లో లేదా కొరియర్ ద్వారా పంపించవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారాల కోసం జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్-1 పోస్టు, సెనోగ్రాఫర్(గ్రేడ్-3) 1 పోస్టు, టైపిస్టు-2, డ్రైవర్-1 పోస్టు, ఆఫీస్ సబార్డినేట్-3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

అర్హతలు

తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వెంట్లుగా పనిచేసి రిటైర్డ్ అయిన వారైతే 2024 జూలై 1వ తేదీ నాటికి 65 సంవత్సరాలు లోపు వయస్సు ఉండాలని అన్నారు. రిటైర్డ్ అయిన వారు అందుబాటులో లేకపోతే ఇతర అభ్యర్థులతో ఈ పోస్టులను భర్తీ చేస్తామని, వారికి 2024 జూలై 1వ తేదీ నాటికి 18 నుంచి 34 సంవత్సరాలు లోపు వయస్సు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ వారికి ఐదేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వయస్సు మినహాయింపు ఉంటుందని వెల్లడించారు.

విద్యార్హతలు

సీనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉండాలని, కంప్యూటర్ నైపుణ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, స్టెనోగ్రాఫర్ గ్రేడ్- 3 పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉండి తెలంగాణ ప్రభుత్వం ద్వారా టెక్నికల్ ఎగ్జామినేషన్ ఇంగ్లిష్ హయ్యర్ గ్రేడ్ తప్పనిసరిగా పాస్ అయి ఉండాలని పేర్కొన్నారు. టైపిస్ట్ పోస్టుకు బ్యాచులర్ డిగ్రీతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ ఎగ్జామినేషన్ ద్వారా నిర్వహించిన ఇంగ్లిష్ టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలన్నారు. డ్రైవర్ పోస్ట్‌కు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై తెలుగు, ఉర్దూ, హిందీ లేదా ఇంగ్లిష్‌లో రాయడం లేదా చదవడం వచ్చి ఉండాలని, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని అన్నారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు 7 నుంచి 10వ తరగతి పాస్ అయి ఉండాలని, పదో తరగతి కన్నా ఎక్కువ విద్యార్హత ఉన్న వారిని ఈ పోస్టులకు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. పైన పేర్కొన్న పోస్టులకు సంబంధించి టైపు రైటింగ్ షార్ట్ హ్యాండ్ స్టెనోగ్రాఫర్ గ్రేడ్- 3కి, అలాగే టైప్ పోస్టులకు పరీక్ష ఉంటుందని, డ్రైవర్ పోస్ట్‌కు డ్రైవింగ్ టెస్ట్ ఉంటుందని వెల్లడించారు.

దరఖాస్తుకు పొందుపర్చాల్సిన ధ్రువపత్రాలు

అభ్యర్థులు దరఖాస్తుతో పాటు వారి విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్‌లను, బర్త్ సర్టిఫికెట్, కులం సర్టిఫికెట్, ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు, లోకల్- నాన్ లోకల్ సర్టిఫికెట్, సొంత చిరునామా కలిగిన రిజిస్టర్ పోస్టు చేసేలా రూ.30 స్టాంపులు అతికించిన కవర్‌ను జత చేయాలని సూచించారు. జూన్ 7 తర్వాత వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితులలో అనుమతించమని స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ): పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామానికి చెందిన పిట్టల వెంకన్న(40) ఎనిమిది నెలల నుంచి హైదరాబాద్ జీహెచ్ఎంసీలో కాంట్రాక్టు పద్ధతిలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మే 16వ తేదీ రాత్రి హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో వెంకన్న నడుపుతున్న జేసీబీ తగిలి మహిళకు గాయాలయ్యాయి. బాధితురాలికి నష్టపరిహారం కింద డబ్బులు ఇస్తానని వెంకన్న పెద్ద మనుషులలో ఒప్పుకున్నాడు. ఈ మేరకు డబ్బుల కోసం స్వగ్రామానికి వచ్చి బంధువులు, స్నేహితులను అప్పు అడగగా.. ఎక్కడా అప్పు దొరక్కపోవడంతో మనస్తాపానికి గురై మే 21వ తేదీన మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడు గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సింగం రామ్మూర్తి కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

కట్టంగూర్: మండల పరిధిలోని పామనగుండ్ల గ్రామ సమీపంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం లేని వ్యక్తి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై తిరుగుతుండగా పామనగుండ్ల గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు ఘటనా స్థలంలో లభించకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి జయసుధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు.

మద్యం పట్టివేత

మర్రిగూడ : మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన మామిడి సత్తయ్య తన కిరాణ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని గురువారం ఎస్‌ఐ కె.రంగారెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పట్టుకున్నారు. కిరాణ వ్యాపారి నుంచి ఐదు ఐబీ ఫుల్ బాటిళ్లు, ఆరు రాయల్ స్టాగ్, మూడు ఐబీ క్వాటర్లు స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది శ్రీనివాస్, సైదులు, యాదగిరి, సతీష్, రమేష్ ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణ పరిధిలోని ఖిలానగర్ సంతోషిమాత సహిత ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. భువనగిరి టౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి ఖిలానగర్ సంతోషిమాత సహిత ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో చెట్ల మధ్యలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. టౌన్ ఎస్‌ఐ నాగరాజు, ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే అతడు మృతిచెందాడు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు గులాబీ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించినట్లు పేర్కొన్నారు. మృతుడి గురించిన వివరాలు లేదా ఆచూకీ తెలిసిన వారు 8712662488 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సాగర్-హైదరాబాద్ హైవే పక్కన..

చింతపల్లి: మండలంలోని పోలేపల్లి రాంనగర్ వద్ద హైదరాబాద్-సాగర్ హైవే పక్కన గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పోలేపల్లి రాంనగర్ వద్ద హైదరాబాద్-సాగర్ హైవే వెంట 40 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి నెల రోజుల నుంచి భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఆ వ్యక్తి రోడ్డు పక్కన మృతిచెంది కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. పోలేపల్లి గ్రామ పంచాయతీ కారోబార్ మాడ్గుల సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుడి చేతికి ఆరు వేళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

నేవీ ఉద్యోగికి కన్నీటి వీడ్కోలు

- కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సింహాపురం వాసి మృతి
- స్వగ్రామంలో పూర్తయిన అంత్యక్రియలు


సందీప్‌రెడ్డి (ఫైల్)


సందీప్‌రెడ్డి యూనిఫాంను తల్లిదండ్రులకు అందజేస్తున్న నేవీ అధికారులు

నకిరేకల్: కర్ణాటక రాష్ట్రంలో ఈ నెల 28వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నకిరేకల్ మండలం నర్సింహాపురం గ్రామానికి చెందిన నేవీ ఉద్యోగి మారెడ్డి సందీప్‌రెడ్డి(27) మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. సందీప్‌రెడ్డి మృతదేహం వెంట నేవీ అధికారులు సూర్యభవి వర్గీ, ఆశిష్, నాగరాజు ఇక్కడకు వచ్చి మృతదేహం వద్ద గౌరవ వందనం చేసి అతని డ్యూటీ యూనిఫాంను తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. నర్సింహాపురం గ్రామానికి చెందిన మారెడ్డి లింగారెడ్డి, మంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. వీరిది వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ ఇద్దరు కుమారులను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు మారెడ్డి మహేశ్వర్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాలలో అవుట్‌సోర్సింగ్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు సందీప్‌రెడ్డి(27) ఆరేళ్ల క్రితం నేవీలో చేరాడు. కర్ణాటకలోని కర్వార్‌లో నేవీకి సంబంధించిన లాజిస్టిక్స్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. నెల రోజులు సెలవులు దొరకడంతో సందీప్‌రెడ్డి గత నెల స్వగ్రామానికి వచ్చాడు. సెలవులు ముగియడంతో ఈ నెల 27న స్వగ్రామం నుంచి బైక్‌పై మహబూబ్‌నగర్‌లో ఉంటున్న తన అన్నయ్య వద్దకు వెళ్లి అక్కడే ఉన్నాడు. 28వ తేదీన సందీప్‌రెడ్డి హైదరాబాద్‌కు చెందిన సహ ఉద్యోగితో కలిసి వేర్వేరు బైక్‌ల మీద తాము ఉద్యోగం చేస్తున్న కర్ణాటక రాష్ట్రంలోని కర్వార్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో సాయంత్రం కర్ణాటకలోని హుబ్లీ జిల్లా అనిగిరి సమీపంలో సందీప్‌రెడ్డి నడుపుతున్న బైక్ అదుపుతప్పడంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సందీప్‌రెడ్డి మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి నివాళులర్పించారు.

ఆత్మహత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

- రైలు కింద పడి వివాహిత, ఆమె ప్రియుడు ఆత్మహత్య


ధనలక్ష్మి (ఫైల్)


దుర్గాప్రసాద్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: వివాహేతర సంబంధం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. రైలు కింద పడి వివాహిత, ఆమె ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన మిర్యాలగూడ మండలంలో గురువారం జరిగింది. రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం పరిధిలో గల దుర్గానగర్‌కు చెందిన ఆర్. ధనలక్ష్మి(22) జి. దుర్గాప్రసాద్ (19) మధ్య కొద్దిరోజులుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ధనలక్ష్మికి భర్త, కుమారుడు భార్గవ్, కుమార్తె భవాని ఉన్నారు. దుర్గాప్రసాద్‌కు వివాహం కాలేదు. వివాహేతర సంబంధం విషయం ధనలక్ష్మి భర్తకు తెలియడంతో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ధనలక్ష్మి మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోగా.. ఆమె భర్త మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం ధనలక్ష్మి, దుర్గాప్రసాద్ మిర్యాలగూడ మండలం ఐలాపురం వద్ద రైల్వే పట్టాల పైకి చేరుకుని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహాలు పడి ఉన్నాయనే సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాల వద్ద లభించిన ఆధారాల ప్రకారం వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇరు కుటుంబాల బంధువులు ఏరియా ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

చౌటుప్పల్: ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వనం రేవతికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త గతంలోనే చనిపోయాడు. పెద్ద కుమారుడు వనం లక్ష్మణ్(18) చౌటుప్పల్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేశాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో పలు సబ్జెక్టులు ఫెయిల్ అవ్వడంతో ప్రస్తుతం సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రోజుమాదిరిగా కూలీ పనికి వెళ్లిన తల్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి లక్ష్మణ్ ఉరికి వేలాడుతూ కన్పించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా లక్ష్మణ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

భార్య తరఫు బంధువుల వేధింపులు తట్టుకోలేక..

సంస్థాన్ నారాయణపురం: భార్య తరఫు బంధువులు వేధింపులు తట్టుకోలేక ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం రాత్రి సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం గ్రామానికి చెందిన ఒర్సు విజేందర్(36) కంప్రెషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడు గత మూడూ నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విజేందర్ తన భార్య వైష్ణవి, ఆమె తల్లిదండ్రులు, బంధువులతో కలసి ఈ నెల 21 తీర్థయాత్రలకు వెళ్లి 27న వచ్చారు. అయితే తీర్థయాత్రలో భార్య తరఫు బంధువులు వేధించడంతో మనస్తాపానికి గురైన విజేందర్‌ను బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ముత్యాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్‌పై కేసు నమోదు

సూర్యాపేటటౌన్: మహిళా డాక్టర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సూర్యాపేట జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వయోవృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఆలన విభాగానికి కళ్యాణ్ చక్రవర్తి ప్రోగ్రాం అధికారిగా పని చేస్తున్నారు. అయితే తనను కళ్యాణ్ చక్రవర్తి కొన్ని రోజులుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని ఆలన విభాగంలో పనిచేసే ఓ మహిళా డాక్టర్ గతంలో డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు. కానీ ఎవరూ పట్టించుకోకపోడంతో ఈ నెల 28న సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా పని పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని ఆ ఫిర్యాదులో ఆమె పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు కళ్యాణ్ చక్రవర్తిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదైన నాటి కళ్యాణ్ చక్రవర్తి అందుబాటులో లేకపోవడంతో శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం కలెక్టర్, డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. ప్రస్తుతం డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సూర్యాపేట టౌన్ సీఐ రాజశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


సైదులు (ఫైల్)

అర్వపల్లి: అర్వపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా సూర్యాపేట-జనగామ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామానికి చెందిన పూజారి సైదులు (30) బైక్‌పై వెళ్తూ అర్వపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట లారీని ఓవర్‌టేక్ చేయబోయి దానికి తగిలి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అదే రూట్లో బైక్‌పై వెళ్తున్న అర్వపల్లికి చెందిన చెన్నబోయిన శ్రీను ముందు బైక్‌ను తప్పించబోయి కిందపడగా.. తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సూర్యాపేటకు తరలించారు. ఈ ప్రమాదంలో రాజేశ్వరి అనే మహిళ స్వల్పంగా గాయపడింది. మృతుడు సైదులుకు భార్య, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, అర్వపల్లి ఎస్‌ఐ ఎస్‌కే యాకూబ్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతుల్లేని పత్తి విత్తనాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

మోతె: అనుమతుల్లేని పత్తి విత్తనాలు తరలిస్తున్న వాహనాన్ని మోతె మండల పరిధిలో మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద గురువారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద మోతె పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అశోక్ లేలాండ్(టీఎస్ 28 టీబీ 2987) వాహనంలో 75 పత్తి విత్తనాల బస్తాలు కనిపించాయి. ఒక్కో బస్తాలో విష్ణు కాటన్ బీటీ-11(ఈఏ378) అనే కంపెనీ పేరు గల 40 పత్తి విత్నాల ప్యాకెట్లు ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.25,92,000 ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ పత్తి విత్తనాల లోడు ఎక్కడికి వెళ్తుందని వాహన డ్రైవర్‌ను పోలీసులు విచారించగా.. భద్రాది కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పడమటి నర్సింహాపురంలోని నాగార్జున ఏజెన్సీ వారికి కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌లో గల శాలివాహన బయో సైంటిస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు పంపారని.. ఈ విత్తనాలకు తెలంగాణలో అనుమతులు లేకపోవడంతో వాటిని తిరిగి కర్ణాటకకు తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు. దీనిపై పూర్తి సమాచారం తెలుసుకునేందుకు గాను మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి వాహనాన్ని మోతె పోలీస్ స్టేషన్‌లో తరలించారు.

ఖననం చేసిన బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం

- తన కొడుకును భర్తే హత్య చేశాడని భార్య పోలీసులకు ఫిర్యాదు
- జాజిరెడ్డిగూడెంలో ఘటన


పంచనామా నిర్వహిస్తున్న అధికారులు


అద్వికేతేజస్ (ఫైల్)

అర్వపల్లి: ఖననం చేసిన బాలుడి మృతదేహాన్ని 11రోజుల తర్వాత బటయకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు.. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన రావుల భిక్షం, కరుణ దంపతుల కుమారుడు రావుల అద్వికేతేజస్(5) సంతానం. భిక్షం స్వగ్రామం తిరుమలగిరి మున్సిపాలిటీ కాగా ఏడాది నుంచి తన అత్తగారి ఊరైన జాజిరెడ్డిగూడెంలో కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో ఉంటూ సుతారి పనులకు వెళ్తున్నాడు. ఈ నెల 20న ఉదయం కరుణ కిరాణా సామాను తీసుకురావడానికి దుకాణం వద్దకు వెళ్లింది. అయితే ఆమె వచ్చేసరికి ఇంట్లో కుమారుడు అద్వికేతేజస్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో చికిత్స నిమిత్తం స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. బాలుడిని పరీక్షించిన ఆర్ఎంపీ పల్స్‌రేట్ పడిపోయి అపస్మారక స్థితికి వెళ్లాడని వెంటనే మెరుగైన వైద్యం కోసం సూర్యాపేటకు తీసుకెళ్లాలని సూచించాడు. కానీ భిక్షం బైక్‌పై భార్య, కుమారుడిని తీసుకొని తన స్వగ్రామమైన తిరుమలగిరికి వెళ్లి అక్కడ మళ్లీ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆ ఆర్ఎంపీ కూడా సూర్యాపేటకు తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే బాలుడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని జాజిరెడ్డిగూడెం తీసుకొచ్చి ఖననం చేశారు.

రక్తపు మరకలు కనిపించడంతో..

కాగా వీరు అద్దెకుంటున్న ఇంటి యజమాని తన మరమ్మతుల కోసం ఇల్లు ఖాళీ చేయాలని భిక్షంను కోరగా.. అన్ని సామాన్లను అక్కడి నుంచి తన అత్తగారింటికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో అద్వికేతేజస్ ధరించిన టీషర్ట్‌కు రక్తపు మరకలు కనిపించాయి. దీంతో భార్య కరుణ భిక్షంను రక్తపు మరకలు ఎక్కడివని నిలదీసింది. ఇలా నిలదీయగానే తన ఇంటికి వెళ్తున్నానని భిక్షం చెప్పడం, అతడి ప్రవర్తనలో మార్పురావడంతో భార్యకు అనుమానం వచ్చింది. వెంటనే తన అన్నలకు విషయాన్ని తెలియజేసింది. వారు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. భార్య కరుణ ఫిర్యాదు మేరకు భిక్షంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఖననం చేసిన అద్వికేతేజస్ మృతదేహాన్ని గురువారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు సమక్షంలో బయటకు తీయగా.. సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఇస్మాయిల్ పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాకే పూర్తి వివరాలు వెల్లడవుతాయని స్థానిక ఎస్‌ఐ ఎస్‌కే యాకూబ్ తెలిపారు. కాగా తన భర్త భిక్షం సుతారి పనికి వెళ్లేవాడని, తరచూ మద్యం సేవించి తనను, తన పిల్లలను వేధించేవాడని భార్య కరుణ పేర్కొంది. తన భర్తే తన కుమారుడిని హత్య చేశాడని ఆరోపించారు. కాగా అద్వికేతేజస్ జాజిరెడ్డిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్నాడు. కాగా కరుణకు మూడేళ్ల కుమార్తె కూడా ఉంది.